రైతులకు మరింత సేవ చేయాలి: మంత్రి పొన్నం

ఏఎంసీ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి ప్రభాకర్

హుజూరాబాద్ టౌన్, నవంబర్ 25: రైతులకు మరింత సేవ చేయాలని హుజూరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ సభ్యులకు మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. హుజూరాబాద్ మున్సిపల్ పరిధి కొత్తపల్లి గ్రామంలోని వ్యవసాయ మార్కెట్ ఆవరణలో సోమవారం జరిగిన మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణస్వీకారోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా చైర్‌పర్సన్‌గా గూడూరి రాజేశ్వరీస్వామిరెడ్డి, వైస్ చైర్మన్ నాంపల్లి తిరుపతి, కమిటీ సభ్యులతో జిల్లా వ్యవసాయ అధికారి ప్రకాశ్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా మంత్రి.. ప్రమాణ స్వీకారం చేసిన మార్కెట్ కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, హుజూరాబాద్ కాంగ్రెస్ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశ్, జిల్లా కాంగ్రెస్ ముఖ్య నేతలు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన

శంకరపట్నం, నవంబర్ 25: తాడికల్ సింగిల్ విండో ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. రైతులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని నిర్వాహకులను మంత్రి ఆదేశించారు.

విజ్ఞానాన్ని అక్షర రూపంలో సమాజానికి అందించాలి

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

హుజూరాబాద్ రూరల్, నవంబర్ 25: విషయ పరిజ్ఞాన నిపుణులు తమకు తెలిసిన విజ్ఞానాన్ని అక్షర రూపంలో పుస్తకం ద్వారా సమాజానికి అందించాలని కిట్స్ సెక్రటరీ, హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే సతీశ్ కుమార్ సూచించారు. సోమవారం మండలంలోని సింగాపూర్ కిట్స్ కాలేజీలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ శంకర్ అధ్యక్షతన నిర్వహించిన క్రిప్టోగ్రఫీ అండ్ సైబర్ సెక్యూరిటీ పుస్తకావిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. అధ్యాపకులు పుస్తకాలను రాయడం వల్ల విద్యార్థులకు అదనపు సాంకేతిక విజ్ఞానం అందుబాటులోకి వస్తుందన్నారు. పుస్తక రచయితలైన కిట్స్ సీఎస్సీ విభాగాధిపతి మేజర్ డాక్టర్ రవీంద్రబాబు, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎన్ రఘును అభినందించారు. ఈ పుస్తకాన్ని ప్రముఖ ప్రచురణ సంస్థ ఐకాప్ ప్రచురించడం గొప్పవిషయమన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ శంకర్, ఏఐఎంఎల్ విభాగాధిపతి, డీన్ డాక్టర్ ప్రవీణ్ కుమార్, అధ్యాపకుడు ప్రశాంత్ కుమార్, వివిధ విభాగాల అధిపతులు అధ్యాపకులు ఉన్నారు.

ప్రతి ఇంటినీ సర్వే చేయాలి

కార్పొరేషన్, నవంబర్ 25 : నగరంలో కులగణనకు సంబంధించి ప్రతి ఇంటినీ సర్వే చేయాలని కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ సిబ్బందికి అన్నారు. సోమవారం నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో కులగణనపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడుతూ, ఎన్యుమరేటర్లు తమకు కేటాయించిన ప్రాంతాల్లో ఏ ఇంటినీ వదిలిపెట్టకుండా సర్వే పూర్తి చేయాలని సూచించారు. అలాగే, నగరంలో ఎవరి ఇంటికైనా ఇప్పటివరకు సర్వే కోసం ఎన్యుమరేటర్లు రాకపోతే ఆ ఇంటి యజమానులు, నగరపాలక సంస్థ పౌర సేవా కేంద్రంలో సంప్రదించాలని నగర కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు.

కాంగ్రెస్ రైతులకు చేసిందేమీలేదు

- ఏడాది పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత
- ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

హుజూరాబాద్ టౌన్, నవంబర్ 25: అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఏడాది కాలంలో రైతులకు చేసిందేమీ లేదని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ధ్వజమెత్తారు. నియోజకవర్గంలో మార్కెట్ కమిటీల ప్రమాణ స్వీకారోత్సవంలో మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలను ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. ఎంతసేపు బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పులు చేసిందని కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతున్నారని.. కానీ ప్రజా సంక్షేమం కోసం కేసీఆర్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి వారికి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ఉపయోగం లేదని మంత్రి అంటున్నారని.. మరీ లక్షలాది ఎకరాలకు సాగునీరు ఎలా అందుతున్నదో ఆయన చెప్పాలన్నారు. ఆరు గ్యారెంటీల్లో ఏ ఒక్క హామీ కూడా పూర్తిస్థాయిలో అమలు చేయలేదని మండిపడ్డారు.

ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

పింఛన్ల పెంపు, కల్యాణలక్ష్మి చెక్కులతో పాటు తులం బంగారం గురించి మంత్రి ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనపై ఏడాదికే ప్రజల్లో తీవ్రమైన వ్యతిరేకత వచ్చిందని స్పష్టం చేశారు. రైతు భరోసా ఎగ్గొట్టింది.. యాసంగిలో నీరందక వేలాది ఎకరాల్లో పంటలు ఎండిపోయిన విషయం వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. కేసీఆర్ హయాంలో కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లోనూ రైతులకు ఇబ్బందులు లేకుండా ప్రతి గింజా కొనుగోలు చేశామని గుర్తు చేశారు. కానీ కాంగ్రెస్ పాలనలో ధాన్యం విక్రయించేందుకు రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. కేసీఆర్ రైతులను కడుపులో పెట్టుకొని చూసుకుంటే.. నేడు కాంగ్రెస్ నేతలు వారిని పట్టించుకోడం లేదని విమర్శించారు. కేసీఆర్ వల్లే నేడు వ్యవసాయ భూముల ధరలు పెరిగాయన్నారు. సాగు, తాగునీటికి ఇబ్బంలేకుండా చేసిన ఘనత గత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. మహారాష్ట్రలో కాంగ్రెస్ పార్టీకి అధికారం రాలేదన్న బాధ మంత్రికి కలుగుతున్నదని ఎద్దేవా చేశారు. ఇకనైనా మంత్రి తప్పుడు ఆరోపణలు మానుకోవాలని హితవు పలికారు. కాంగ్రెస్ పాలనకు సమాధి కట్టేందుకు రైతులంతా ఎదురు చూస్తున్నారని ధ్వజమెత్తారు.

భాషతోపాటు భావ వ్యక్తీకరణ ముఖ్యం : కలెక్టర్

కమాన్‌చౌరస్తా, నవంబర్ 25: విద్యార్థులకు భాషతోపాటు భావవ్యక్తీకరణ, విషయంపై అవగాహన చాలా ముఖ్యమని కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను టీఈడీ (టెక్నాలజీ ఎన్‌రోల్‌మెంట్ డిసైన్) 'స్టూడెంట్స్ టాక్' కార్యక్రమానికి పంపేందుకు పారమిత విద్యాసంస్థల ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా పోటీలు నిర్వహించారు. మండల స్థాయిలో ఎంపిక కోసం మంకమ్మతోటలోని ప్రభుత్వ (ధన్గర్‌వాడీ) పాఠశాలలో సోమవారం నిర్వహించిన కార్యక్రమానికి కలెక్టర్ హాజరై, మాట్లాడారు. తెలుగుతో పాటు ఆంగ్లభాష కూడా నేర్చుకోవడం చాలా ముఖ్యమన్నారు. ప్రపంచ స్థాయిలో విద్యార్థుల ఉపన్యాసానికి వేదికగా ఉన్న టీఈడీకి ఎంపిక కోసం మొదటిసారి జిల్లా నుంచి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను పంపేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇక్కడ పారమిత విద్యాసంస్థల చైర్మన్ ప్రసాదరావు, ఎంఈవో అబ్దుల్ అజీమ్, సర్వశిక్షా అభియాన్ జిల్లా కోఆర్డినేటర్ అశోక్‌రెడ్డి ఉన్నారు.

ఎస్ఎస్ ఈకో షోరూంను ప్రారంభించిన మంత్రి

ఎస్ఎస్ ఈకో షోరూంను ప్రారంభిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

విద్యానగర్, నవంబర్ 25 : నగరంలోని ఎస్సారార్ కాలేజీ వద్ద ఎస్ఎస్ ఈకో షోరూంను సోమవారం మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఢిల్లీలో తీవ్రమైన పొల్యూషన్ కారణంగా అక్కడి ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, మనకు అలాంటి పరిస్థితి రాకుండా ఉండడానికి కాలుష్యం వెదజల్లని ఎలక్ట్రిక్ వెహికల్స్‌ని ప్రతి ఒక్కరూ వాడి పొల్యూషన్ తగ్గించాలన్నారు. ఎలక్ట్రిక్ వాహనాలకు లైఫ్ ట్యాక్స్, రిజిస్ట్రేషన్ ఫీజు 2026 డిసెంబర్ వరకు మాఫీ చేసినట్లు తెలిపారు. ప్రజలు కాలుష్య రహితమైన ఎలక్ట్రిక్ వాహనాలను కొనుగోలు చేసి, పెట్రోల్ ఖర్చులు కూడా ఆదా చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఎస్ఎస్ ఈకో షోరూం ప్రారంభించిన వేణుగోపాల్ రెడ్డిని మంత్రి అభినందించారు. కార్యక్రమంలో ఎస్ఎస్ ఈకో షోరూం అధినేత మహిపాల్ రెడ్డి, కేశవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'దీక్షా దివస్' విజయవంతం చేయాలి

- పార్టీ శ్రేణులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరవ్వాలి
- మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

మానకొండూర్, నవంబర్ 25: తన ప్రాణాన్ని పణంగా పెట్టి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞత తెలుపుతూ ఈ నెల 29న చేపట్టిన దీక్షా దివస్‌కు పార్టీ శ్రేణులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరవుతున్నారని తెలిపారు. దీక్షా దివస్‌కు సంబంధించి సన్నాహక సమావేశం మంగళవారం ఉదయం 11గంటలకు కరీంనగర్‌లోని పద్మనాయక కళ్యాణమండపంలో నిర్వహిస్తున్నామని చెప్పారు. మానకొండూర్ మండల కేంద్రంలో సోమవారం బీర్ఆఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావుతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రసమయి మాట్లాడారు. రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ మొదటి నుంచి కరీంనగర్ గడ్డ నుంచే పోరాటం ప్రారంభించారని, ఈ గడ్డ అనేక విజయాలకు కేరాఫ్‌గా నిలిచిందని గుర్తు చేశారు. స్వాతంత్ర పోరాటంలో గాంధీజీ చేపట్టిన సత్యాగ్రహ దీక్ష ఎంత బలమైందో.. కేసీఆర్ చేపట్టిన దీక్ష కూడా అంతే బలమైనదిగా ప్రజలు భావిస్తారని వెల్లడించారు. ఇచ్చిన హామీలను అమలుచేయకుండా ప్రజా ఉత్సవాల పేరిట రేవంత్ సర్కార్ ప్రజలను వంచన చేస్తున్నదని మండిపడ్డారు. కార్యక్రమంలో సిరిసిల్ల జడ్పీ మాజీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, మాజీ జడ్పీటీసీ తాళ్లపెల్లి శేఖర్‌గౌడ్, నాయకులు దేవ సతీశ్‌రెడ్డి, శాతరాజు యాదగిరి, పిట్టల మధు, దండబోయిన శేఖర్, పురం అనిల్, బొల్లం శ్రీనివాస్, బొడ రాజశేఖర్, నెల్లి శంకర్, కొట్టె రఘు, ఇస్కుల్ల అంజయ్య, పిండి సందీప్, కొండ్ర వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ సీనియర్ నాయకుడికి పరామర్శ

తిమ్మాపూర్, నవంబర్ 25: అల్గునూర్ గ్రామంలో కార్పొరేటర్ సల్ల శారద భర్త రవీందర్ తల్లి ఇటీవల మరణించగా, సోమవారం ఆయనతో పాటు కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పరామర్శించారు. ఆయన వెంట నాయకులు సిద్ధం వేణు, శేఖర్‌గౌడ్, సల్ల మహేందర్ ఉన్నారు.

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను కలిసిన బీసీ సంఘం నాయకులు

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు పుష్పగుచ్ఛం ఇస్తున్న గుంజపడుగు హరిప్రసాద్, తదితరులు

తెలంగాణచౌక్, నవంబర్ 25: యునైటెడ్ పూలే ఫ్రంట్ నాయకురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను బీసీ యునైటెడ్ పూలేఫ్రంట్ రాష్ట్ర నాయకుడు గుంజపడుగు హరిప్రసాద్, నాయకులు మహేశ్, పొన్నం అనిల్‌గౌడ్ సోమవారం హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బీసీల సమస్యలపై చర్చించారు.

కేడీసీసీబీ పాలకవర్గానికి హర్యానా గవర్నర్ అభినందన

పాలకవర్గ సభ్యులను అభినందిస్తున్న హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ

విద్యానగర్, నవంబర్ 25 : కరీంనగర్ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు పాలకవర్గ సభ్యులు సోమవారం చండీగర్ రాజ్ భవన్‌లో హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కరీంనగర్ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు 9 సంవత్సరాల్లో 8సార్లు అత్యున్నతమైన బెస్ట్ బ్యాంక్ అవార్డు సాధించడం గర్వించదగిన విషయమన్నారు. తెలంగాణకు గౌరవాన్ని తీసుకువచ్చిన బ్యాంకు అధ్యక్షుడు కొండూరు రవీందర్‌రావు, వైస్ చైర్మన్, పింగిలి రమేశ్, సీఈవో సత్యనారాయణరావు, పాలకవర్గ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు మాజీ శాసనసభ్యుడు ఉచ్చిడి మోహన్‌రెడ్డి, ముప్పాల రాంచందర్‌రావు, సింగిరెడ్డి స్వామిరెడ్డి, నరేశ్‌రెడ్డి, రవీందర్‌గౌడ్, శ్రీనివాస్, కృష్ణ ప్రసాద్, రమేశ్‌రెడ్డి, కమలాకర్, తిరుపతిరెడ్డి, కోటి, సాగర్, గోపాలరావు, సీఏ రమేశ్, ఎంప్లాయీస్ యూనియన్ ప్రెసిడెంట్ హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవాలి: ఎమ్మెల్యే సత్యం

గంగాధర, నవంబర్ 25 : తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. మండలంలోని ఉప్పరమల్యాలలో నూతనంగా నిర్మించిన పోచమ్మ (శీతలదేవి) ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై, ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నిర్వాహకులు ఎమ్మెల్యేను శాలువాలతో సన్మానించారు. వైద్య చికిత్స కోసం మంగపేట గ్రామానికి చెందిన కొక్కుల లతకు రూ.5 లక్షలు, బావు వేణుకు రూ.1.70 లక్షల ఎల్వోసీ మంజూరు చేయించిన ఎమ్మెల్యే, ప్రొసీడింగ్ పత్రాలను సోమవారం వారి కుటుంబాలకు అందజేశారు.

ఇప్పనపల్లి చారిటబుల్ ట్రస్ట్ సామాజిక సేవలు అభినందనీయం

చొప్పదండి, నవంబర్ 25: పట్టణంలో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ ఇప్పనపల్లి విజయలక్ష్మి– సాంబయ్య కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇప్పనపల్లి చారిటబుల్ ట్రస్ట్ ఫౌండేషన్ ద్వారా చొప్పదండి మున్సిపాలిటీకి రూ .10 లక్షల విలువైన వైకుంఠ రథాన్ని సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ, ఇప్పనపల్లి చారిటబుల్ ట్రస్ట్ చేస్తున్న సామాజిక సేవలు అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ గుర్రం నీరజ– భూమారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తూరు మహేశ్, మున్సిపల్ కమిషనర్ నాగరాజు, కౌన్సిలర్ కొట్టే అశోక్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, పట్టణాధ్యక్షుడు నిజానపురం చందు, నాయకులు పాల్గొన్నారు.

సొంత ఖర్చులతో కల్వల ప్రాజెక్టుకు రైతుల మరమ్మతు

ట్రాక్టర్ స్వయంగా కల్వల ప్రాజెక్టు మత్తడి గండిని పూడ్చుతున్న వీణవంక రైతులు

శంకరపట్నం/ వీణవంక, నవంబర్ 25: శంకరపట్నం మండలంలోని కల్వల ప్రాజెక్టు గండిని స్వయంగా రైతులే పూడ్చేందుకు పూనుకున్నారు. ఈ మేరకు సోమవారం వీణవంక మండలంలోని పలు గ్రామాలకు చెందిన రైతులు జేసీబీ, ట్రాక్టర్లతో తరలివచ్చారు. స్వయంగా సొంత ఖర్చులతో ప్రాజెక్టు మత్తడి గండిని మట్టితో పూడుస్తూ తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కల్వల ప్రాజెక్టు గండిని పట్టించుకునే నాథుడే కరువయ్యాడని ఆవేదన వ్యక్తం చేశారు. కల్వల, వీణవంక, బసప్పపల్లె, కల్లుపల్లె, నర్సింగాపూర్, తదితర గ్రామాల సాగు భూములకు కల్వల ప్రాజెక్టు నీరే ఆధారమన్నారు. ప్రాజెక్టుకు గండి పడడంతో రెండు సంవత్సరాలుగా రైతులు పంటల సాగుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. తాము ప్రస్తుతం తాత్కాలికంగా తూము లెవల్‌కు నీరు వచ్చేలా మట్టితో గండిని పూడుస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికైనా నాయకులు కల్వల ప్రాజెక్టుకు శాశ్వత ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇక్కడ వీణవంక మండలానికి చెందిన పలువురు రైతులు ఉన్నారు.

వేసవిలో విద్యుత్ సరఫరాకు ఇబ్బంది లేకుండా చర్యలు

ముకరంపుర, నవంబర్ 25: వేసవిలో విద్యుత్ సరఫరాకు ఇబ్బంది లేకుండా అన్ని విధాలా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులు నిర్ణయించారు. ఎన్పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం సమ్మర్ యాక్షన్ ప్లాన్ కో–ఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ట్రాన్స్‌కో ఎస్ఈ ఎన్ శ్రీనివాస్, ఎన్పీడీసీఎల్ ఉమ్మడి జిల్లా ఎస్ఈలు ఎం రమేశ్ బాబు, కే మాధవరావు, సాలియా నాయక్ పాల్గొని రాబోయే వేసవిలో విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని ముందస్తుగా చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. 220కేవీ, 132కేవీ సబ్ స్టేషన్లలో పీటీఆర్‌ల సామర్థ్యం పెంపు, అదనంగా పీటీఆర్‌లు ఏర్పాటు చేయడం, కొత్త బ్రేకర్లు, కొత్త లైన్ల ఏర్పాట్లపై సమావేశంలో చర్చించారు. సమావేశంలో డీఈలు విజయేందర్ రెడ్డి, తిరుపతి, లక్ష్మీరెడ్డి, చంద్రమౌళి ,రాజిరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సంపత్, ప్రసాద్, వీఎస్ రావు, రఘు, గంగారాం, ప్రభాకర్, ఏడీఈలు పాల్గొన్నారు.

కొత్తపల్లి పట్టణ విలీన ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ తీర్మానం

కొత్తపల్లి, నవంబర్ 25 : కొత్తపల్లి పట్టణాన్ని కరీంనగర్ కార్పొరేషన్‌లో విలీనం చేసే ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ మున్సిపల్ పాలకవర్గం తీర్మానం చేసింది. సోమవారం మున్సిపల్ పట్టణ కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించి విలీనంపై సుదీర్ఘ చర్చ నిర్వహించారు. చైర్మన్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు విలీనాన్ని వ్యతిరేకిస్తూ తీర్మానం చేసి, ఆ కాపీని అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్‌కి కలెక్టరేట్‌లో అందించారు. కాగా, బీజేపీకి చెందిన కౌన్సిలర్లు కొత్తపల్లి పట్టణాన్ని కరీంనగర్ కార్పొరేషన్‌లో విలీనం చేయడానికి సుముఖంగా ఉన్నామని మున్సిపల్ సాధారణ సమావేశంలో వెల్లడించారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్, కమిషనర్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ విద్యార్థినికి అభినందన

శంకరపట్నం, నవంబర్ 25: జపాన్ సకూర సైన్స్ ఎక్స్ఛేంజ్ కార్యక్రమంలో భాగంగా ఎంపికై ఇటీవల జపాన్ దేశంలో పర్యటించి ఇండియాకు తిరిగి వచ్చిన మోడల్ స్కూల్ విద్యార్థిని సబా మహ్మదీని స్కూల్‌లో సోమవారం ప్రిన్సిపాల్ సరిత, ఉపాధ్యాయులు అభినందించారు. ఘనంగా సన్మానించి, ప్రశంసాపత్రం అందజేశారు.

ప్రతిభ గల క్రైస్తవులకు సత్కారం

కలెక్టరేట్, నవంబర్ 25: క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహించే క్రిస్మస్ సంబురాల్లో భాగంగా, ప్రతిభ గల క్రైస్తవులను సన్మానించనున్నట్లు జిల్లా అల్పసంఖ్యాక వర్గాల సంక్షేమాధికారి పవన్‌కుమార్ తెలిపారు. ఐదేళ్ల నుంచి మూడు దశాబ్దాల క్రితం దాకా వివిధ రంగాల్లో ఉత్తమ ప్రతిభ చూపిన వ్యక్తులు, సంస్థలను సత్కరించే క్రమంలో, దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. ఔత్సాహికులు దరఖాస్తు ఫారాలను జిల్లా అల్పసంఖ్యాక వర్గాల సంక్షేమ శాఖ కార్యాలయం నుంచి పొందవచ్చని లేదా www.tgcmfc.in నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సోమవారం విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించారు. పూర్తి చేసిన దరఖాస్తులను డిసెంబర్ 9వ తేదీలోగా కలెక్టరేట్‌లో గల జిల్లా అల్పసంఖ్యాక వర్గాల సంక్షేమాధికారి కార్యాలయంలో అందజేయాలని, పూర్తి వివరాల కోసం 08782957085 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
BUSINESS OFFER
★సిబిల్ స్కోర్ పెంచబడును ఇంటి పై లోన్ / ఓపెన్ ప్లాట్ లోన్ / బిజినెస్ లోన్/పర్సనల్ లోన్ సంప్రదించండి: పెద్దపల్లి సెల్: 9346756075
NTK-325450

CHANGE OF NAME
I, ERALLA SAMPATH, S/o. KOMURAIAH, R/o. H.No. 11-2-385, Indiranagar, Godavarikhani,Ramagundam Mandal, Peddapalli dist, Telangana, have changed My name from SAMPATH AVUNURI to ERALLA SAMPATH,S/o. KOMURAIAH For all Purpose.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189

క్రిస్మస్ సంబురాలు ప్రారంభం

కమాన్‌చౌరస్తా, నవంబర్ 25: క్రిస్మస్ వేడుకలు సోమవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా ప్రారంభమయ్యాయి. పలుచోట్ల క్రిస్మస్ జ్యోతిని వెలిగించారు, క్రిస్మస్ ట్రీలు ఏర్పాటు చేశారు. కరీంనగర్‌లోని పురాతన సీఎస్ఐ వెస్లీ కేథడ్రిల్ చర్చిలో పాస్టరేట్ చైర్మన్ పాల్ కోమల్ ప్రార్థన చేయించారు. క్రిస్టియన్ కాలనీలోని సెంటినరీ వెస్లీ చర్చిలో క్రీస్తు జనన సన్నివేశ సంగీత నృత్య రూపకాన్ని ప్రదర్శించారు. క్వాయర్స్ బృందం కీర్తనలు ఆలపించారు. కార్యక్రమంలో పాస్టరేట్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ హాస్టల్ తనిఖీ

కలెక్టరేట్, నవంబర్ 25 : నగరంలోని సమీకృత వసతి గృహాన్ని సోమవారం రాత్రి అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, హాస్టల్‌లోని విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని ఆదేశించారు. ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి నేరుగా తీసుకురావాలని సూచించారు. హాస్టల్‌లో వసతులు, విద్యాబోధన, తదితర అంశాలపై విద్యార్థులతో ముచ్చటించారు. విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలన్నారు. శీతాకాలం నేపథ్యంలో ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

మానకొండూర్ రూరల్, నవంబర్ 25: కొండపల్కల గ్రామంలో సోమవారం గ్రామ ముదిరాజ్ కుల సంఘం సభ్యులకు కరీంనగర్ మెడికవర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత గుండె వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో సూపర్ స్పెషాలిటీ డాక్టర్ హర్షిత్ దాదాపు 150 మందికి వైద్య పరీక్షలు చేశారు. ప్రజలకు నిరంతర సేవలు అందించాలనే లక్ష్యంతోనే ఈ శిబిరాన్ని నిర్వహించినట్లు హాస్పిటల్ సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ తెలిపారు.

వింధ్యావ్యాలీ విద్యార్థుల ప్రతిభ

కొత్తపల్లి, నవంబర్ 25 : జిల్లా కేంద్రంలోని మెహర్‌నగర్ వింధ్యావ్యాలీ పాఠశాల విద్యార్థులు భాష్య, శ్రీమయి కార్తీక శివ నృత్యాంజలి అవార్డులు అందుకోగా, సోమవారం పాఠశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ రామవరం లక్ష్మీప్రకాశ్‌రావు అభినందించారు. అలాగే ముమ్ముందు మరిన్ని అవార్డులను అందుకోవాలని ఆకాంక్షించారు. పాఠశాల వైస్ చైర్మన్ రామవరం పృథ్వీరావు, ప్రిన్సిపాల్ జి. ప్రశాంత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టీజీసీటీఏ జిల్లా నూతన కార్యవర్గం

కమాన్‌చౌరస్తా, నవంబర్ 25 : జిల్లా కేంద్రంలోని ఎస్సారార్ కళాశాలలో జిల్లా స్థాయి టీజీసీటీఏ నూతన కార్యవర్గం ఎన్నికలు నిర్వహించారు. ఇందులో అధ్యక్షురాలిగా డాక్టర్ హర్ జ్యోత్ కౌర్, కార్యదర్శిగా డాక్టర్ ప్రభాకర్, కోశాధికారిగా డాక్లర బూర్ల నరేశ్, మహిళా కార్యదర్శిగా డాక్టర్ శ్యామల ఎన్నికయ్యారు. వారిని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కల్వకుంట రామకృష్ణ అభినందించారు.

తెరుచుకోని విద్యుత్ వసూలు కేంద్రం

గంగాధర, నవంబర్ 25 : మధురానగర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రం సోమవారం ఉదయం 11 గంటల వరకు తెరుచుకోలేదు. విద్యుత్ బిల్లులు చెల్లించడానికి వచ్చిన వినియోగదారులు కేంద్రానికి తాళం వేసి ఉండడంతో అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఒక్క రోజు బిల్లు కట్టడం ఆలస్యం అయితే విద్యుత్ సిబ్బంది ఇండ్ల వద్దకు వచ్చి కరెంటు కనెక్షన్ కట్ చేస్తారని తెలిపారు. బిల్లు చెల్లించడానికి వస్తే కేంద్రం తాళం వేసి ఉందని మండిపడ్డారు. అధికారులు స్పందించి విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రం తెరిచి ఉంచాలని కోరుతున్నారు.

27న నిధి ఆప్‌కే నికట్-2.0

విద్యానగర్, నవంబర్ 25: భవిష్యనిధి సంస్థ కరీంనగర్ ప్రాంతీయ కార్యాలయం (ఈపీఎఫ్ఓ), సువిధి సమాగం సంయుక్త భాగస్వామ్యంతో ఈనెల 27న నిధి ఆప్‌కే నికట్–2.0 (పీఎఫ్ మీ దగ్గర) అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు పీఎఫ్ కమిషనర్ సెల్వత్కర్ తానయ్య ఒక ప్రకటనలో తెలిపారు. కరీంనగర్ కోతిరాంపూర్‌లోని వెంకటసాయి ఎంటర్ ప్రైజెస్ ప్రైవేట్ లిమిటెడ్‌లో, పెద్దపల్లిలోని సుల్తానాబాద్‌లో విజ్ఞాన్ హైస్కూల్ ఆడిటోరియంలో, జగిత్యాలలో శ్రీ ప్రతిభ హైస్కూల్ నూకపల్లి ఎక్స్‌రోడ్డు, సిరిసిల్లలో కృష్ణవేణి టాలెంట్ స్కూల్, మంచిర్యాలలో మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో, ఆసిఫాబాద్‌లో ఫాతిమా హైస్కూల్‌లో, ఆదిలాబాద్‌లో డీఆర్‌డీఏ సమావేశ హాల్‌లో, నిర్మల్‌లో మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో కార్యక్రమాలు జరుగుతాయని, వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఫార్మసీ రంగంలో రాణించాలి

మాట్లాడుతున్న రమేశ్‌రెడ్డి

తిమ్మాపూర్, నవంబర్ 25: ఎల్ఎండీ కాలనీలోని శ్రీ చైతన్య ఫార్మసీ కళాశాలలో బీ ఫార్మసీ, ఫార్మ్ డీ కోర్సుల్లో నూతనంగా ప్రవేశం పొందిన విద్యార్థులకు సోమవారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యా సంస్థల చైర్మన్ ముద్దసాని రమేశ్‌రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులు ఇప్పటి నుంచే ఫార్మసీ రంగంలో రాణించేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ రామనర్సింహారెడ్డి, ప్రొఫెసర్ అప్పారావు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు కోసం ఈ నెల 27న పాదయాత్ర

సైదాపూర్, నవంబర్25: తెలంగాణ ఉద్యమకారుల మహా సంకల్ప పాదయాత్రను విజయవంతం చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మండలాధ్యక్షుడు వస్తాదుల సదానందం, నియోజకవర్గ ప్రచార కార్యదర్శి చిరంశెట్టి శ్రీనివాస్ కోరారు. మండలకేంద్రంలో వారు మాట్లాడుతూ, ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని ఈ నెల 27న కరీంనగర్ నుంచి వేములవాడ వరకు ఈ యాత్ర చేపడుతున్నామని తెలిపారు. మండలంలోని గ్రామాలకు చెందిన తెలంగాణ ఉద్యమకారులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి గడ్డం స్వామి, నాయకులు పొడిశెట్టి విజయ్, గోపగోని నవీన్, పూసాల ఆంజనేయులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో అన్నదానం

కమాన్‌చౌరస్తా, నవంబర్ 25 : జిల్లా కేంద్రంలోని భగత్‌నగర్ హరిహర క్షేత్రం అయ్యప్ప స్వామి ఆలయంలో ఈ ఏడాది కూడా దీక్షాపరులకు అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. ఉదయం ఆలయ ఈవో కాంతారెడ్డి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు మంగళపల్లి రాజేశ్వరశర్మ, డింగరి చాణక్య, శ్రీనివాస్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఇక్కడ గురు స్వాములు జీఎస్ ఆనంద్, భూపతి రావు, నారాయణ, లింగపల్లి సత్యం తదితరులు పాల్గొన్నారు. కాగా, అన్నదాన కార్యక్రమ ప్రారంభం సందర్భంగా ఆలయ ఈవో ఆధ్వర్యంలో మంత్రి పొన్నంను కలవగా, దైవ కార్యక్రమం నిర్విరామంగా సాగాలని, దీనికి తన సహకారం ఎల్లవేళలా ఉంటుందని చెప్పారు.

చేతి వృత్తులపై విద్యార్థుల ప్రదర్శన

రామడుగు, నవంబర్25 : గోపాల్‌రావుపేట ఉన్నత పాఠశాలలో ఏడో తరగతి విద్యార్థులు పాఠ్యాంశంలో భాగంగా చేతి వృత్తులపై అవగాహన, ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా సాంఘికశాస్త్రం ఉపాధ్యాయుడు విద్యార్థులతో పలు రకాల పనిముట్లను తయారు చేయించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం శైలజ, ఉపాధ్యాయులు వనిత, మంజుల, గంగ, రాజమహేందర్, వీర్‌పాల్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

అనారోగ్యంతో విద్యార్థిని మృతి

నిత్యశ్రీ (ఫైల్)

జమ్మికుంట (హుజూరాబాద్ టౌన్), నవంబర్ 25: ప్రభుత్వ పాఠశాలలో అస్వస్థతకు గురైన ఓ విద్యార్థిని చికిత్స పొందుతూ మృతిచెందిన ఘటన జమ్మికుంట పట్టణంలో జరిగింది. పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయుల నిర్లక్ష్యమే కారణమని తల్లిదండ్రుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ రవి తెలిపారు. పట్టణంలోని కస్తూర్బా పాఠశాలలో భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం ముల్కలపల్లి గ్రామానికి చెందిన రవి– ఇందిర దంపతులు పట్టణంలోని కేశవపూర్‌లో జీవనం సాగిస్తున్నారు. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. కూతురు నిత్యశ్రీ(15)ని పట్టణంలోని కస్తూర్బా పాఠశాలలో చేర్పించారు. నిత్యశ్రీ 10వ తరగతి చదువుతున్నది. ఈనెల 17న విద్యార్థిని అస్వస్థతకు గురి కాగా.. తల్లిదండ్రులు దవాఖానకు తీసుకెళ్లి, తిరిగి హాస్టల్లో చేర్పించారు. తర్వాత విద్యార్థిని పరిస్థితి విషమంగా మారగా.. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సుప్రియ, ఉపాధ్యాయిని, ఏఎన్ఎంలు నిర్లక్ష్యంగా వ్యవహరించి ఈనెల 21న తల్లిదండ్రులకు సమాచారమిచ్చారు. కుటుంబ సభ్యులు నిత్యశ్రీని హనుమకొండ హాస్పిటల్‌లో చేర్పించగా, చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందింది. ఆమె తండ్రి రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ తెలిపారు. డీఈవో జనార్దన్ రావు పాఠశాలలో ఆదివారం సాయంత్రం విచారణ చేపట్టారు. విద్యార్థి మృతి విషయంలో గోప్యత పాటించి, విచారణ జరిపారనే ఆరోపణలున్నాయి. నివేదికను ఉన్నతాధికారులకు అందించనున్నట్లు సమాచారం.

గురుకులాల్లో వసతులు మెరుగు పర్చాలి

కలెక్టరేట్, నవంబర్ 25: సాంఘిక సంక్షేమ గురుకులాల్లో వసతులు మెరుగుపర్చాలని గురుకుల విద్యార్థుల పేరెంట్స్ కమిటీ డిమాండ్ చేసింది. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణిలో గురుకులాల్లోని అసౌకర్యాలపై అదనపు కలెక్టర్‌కు పేరెంట్స్ కమిటీ ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. గురుకులాల్లో చదువుకుంటున్న పేద విద్యార్థులు అరకొర సౌకర్యాలతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తాగడానికి, ఇతర అవసరాలకు వినియోగించే నీరు కూడా పరిశుభ్రంగా ఉండడం లేదని, నగర నడిబొడ్డున గల చింతకుంట సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలనే ఇందుకు నిదర్శనమని అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్‌కు విన్నవించారు. పాఠశాలలో బాత్రూంలు అధ్వానంగా ఉన్నాయని సాక్ష్యాలతో వివరించారు. విద్యార్థులకు వెంటనే సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కమిటీ ప్రతినిధులు బద్రకంటి రజిత, శరత్‌బాబు, సురేందర్, కందుకూరి బాపుదేవ్, బాబు, శ్రీనివాస్, సుధాకర్, రాధిక, కవిత, అంజయ్యతో పాటు పలువురు పాల్గొన్నారు.

కేంద్రమంత్రికి ఆశ కార్యకర్తల వినతి

విద్యానగర్, నవంబర్ 25 : తెలంగాణ గ్రామీణ ఆరోగ్య కార్యకర్తల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రబియా బేగం, దోసపాటి సరితతోపాటు పలువురు నాయకులు సోమవారం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌ను ఎంపీ కార్యాలయంలో కలిశారు. తమ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు.

కేంద్ర సహాయ మంత్రిని కలిసిన ఆర్టిజన్లు

తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ కన్వర్షన్ జేఏసీ నాయకులు సోమవారం కేంద్ర మంత్రి బండి సంజయ్‌ని ఎంపీ కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఉద్యోగ భద్రత లేక మానసిక క్షోభను అనుభవిస్తున్నామని, మానవతా దృక్పథంతో ఆలోచించి, సీఎం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని వేడుకున్నారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ, వెంటనే ఆర్టిజన్ల విద్యార్హతల మేరకు రెగ్యులర్ పోస్టుల్లోకి కన్వర్షన్ ఇవ్వాలని కోరారు. లేని పక్షంలో ఆర్టిజన్లతో కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు.